సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



ఇవేం 'ఉపాధి' పనులు?

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం కొందరు ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. 8లో



...ఫిర్యాదు చేయండి

ఎన్నికల వేళ అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినా, అక్రమాలకు పాల్పడినా సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 8లో



వాతావరణం

జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సాయంత్రం వరకు వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం జరుపుతున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, కుంకుమ పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కనకయ్య



ఇల్లెందు: మహబూబాబాద్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచార సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిసి శాలువాతో సత్కరించారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ నామినేషన్ సందర్భంగా పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు సీఎంను కలిశారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: వచ్చే నెల 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ పి.పరందామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన నెల పాటు శిబిరాలు కొనసాగుతాయని, శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న సీనియర్ క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాకారులు, పీఈటీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీనియర్, జాతీయస్థాయి క్రీడాకారులైతే వారి ప్రగతికి సంబంధించిన ధ్రువపత్రాలను జతచేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా ఉండి శిక్షణ ఇవ్వగలిగే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 24వ తేదీ సాయంత్రం 4గంటల్లోగా అందజేయాలని డీవైఎస్‌ఓ సూచించారు.

మే 24న పాలిసెట్

- దరఖాస్తుకు ఈ నెల 26 వరకు గడువు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు వచ్చే నెల 24న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ బి.నాగమునినాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, రూ.100 జరిమానాతో 24వ తేదీ వరకు, రూ.300 అపరాధ రుసుముతో ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని తెలిపారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు తిరిగి ప్రారంభించే నాటికి మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో స్క్రాప్ ఉంటే సబ్ డివిజన్ కమిటీ ద్వారా పరిశీలించి తొలగించాలనానరు. ప్రత్యేక అధికారులు పాఠశాలలకు వైట్ వాష్, ఫ్లోరింగ్ రిపేర్, మంచాలు కటింగ్ చేయించి విద్యార్థులకు అందేలా చూడాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు తప్పనిసరిగా వేసవి సెలవుల్లో పాఠశాలలను సందర్శిస్తూ ఉండాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్వో సురేష్‌బాబు, ఉద్యానవన అధికారి అశోక్‌కుమార్, ఏడీ భాస్కరన్, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవి అవినీతి ప్రభుత్వాలు..





ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు, ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పక్కన అభ్యర్థి వినోద్‌రావు, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండింటి తీరు అదే..

- కేంద్రంలో పదేళ్లు మోదీది నీతివంతమైన పాలన
- తెలంగాణ సాధనలో బీజేపీ పాత్ర మరువలేనిది
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర మరువలేనిది. రాష్ట్రం ఏర్పడితే నీతివంతమైన పాలన అందుతుందని ప్రజలు ఆశించారు. కానీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిమయంగా మారాయి. బీఆర్‌ఎస్ ప్రజలను దోచుకుంటే ప్రజలు ఆ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో తరిమికొట్టారు. కాంగ్రెస్ సైతం ఇదే రీతిలో ముందుకు వెళ్తోంది.' అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆరోపించారు. ఖమ్మంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ దాఖలు చేయగా.. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి జెడ్పీ సెంటర్‌లో ప్రసంగించారు. దేశంలో కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు జరగగా.. పదేళ్లుగా నరేంద్రమోదీ పాలన మాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా సాగుతోందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పేదరికం నిర్మూలిస్తామని చెప్పారే తప్ప చేయలేదని, మోదీ ప్రభుత్వంలో 25 కోట్ల మంది నిరుపేదలను ఉన్నత స్థానానికి చేర్చామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా దేశంలో లక్షలాది మందికి ఉచితంగా రూ.5లక్షల వరకు ఆరోగ్య చికిత్స అందించే అవకాశం మోదీ ప్రభుత్వం కల్పించిందన్నారు. కాగా, నీతివంతుడైన, డైనమిక్ లీడర్ వినోద్‌రావును ఖమ్మం ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఆపై తాను సైతం ఖమ్మం వచ్చి ఇక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సేవా రంగంలో వినోద్‌రావు అంకిత భావం తిరుగులేనిదని అభినందించారు. కాగా, కేంద్ర మంత్రి ప్రసంగిస్తున్నంత సేపు జై శ్రీరామ్, జై భారత్, జై మోదీ నినాదాలు మిన్నంటాయి.

కమలం.. కదనోత్సాహం

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మంలో కాషాయ శ్రేణులు కదం తొక్కాయి. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు శుక్రవారం పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరు కాగా.. ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. సర్దార్ పటేల్ స్టేడియం వద్ద మొదలైన ర్యాలీ జెడ్పీ సెంటర్, వైరా రోడ్, పాత బస్టాండ్, మయూరిసెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్‌కు చేరింది. ర్యాలీలో మహిళల కోలాట నృత్యాలు, గిరిజన మహిళలు బిందెల ప్రదర్శన, బోనాలు ఆకట్టుకున్నారు. అలాగే ఆదివాసీ కళాకారులు డప్పు, కొమ్ము నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ప్లకార్డులను ప్రదర్శించారు. అలాగే, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. కాగా, సర్దార్ పటేల్ స్టేడియానికి హెలీకాప్టర్ చేరుకున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నాయకులు స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగాకిరణ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణతో పాటు శ్రీకాంత్, శీలం పాపారావు, గోంగూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'తాండ్ర' నామినేషన్



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పిస్తున్న తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం సహకారనగర్: బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి వీ.పీ.గౌతమ్‌కు శుక్రవారం ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాగా, తొలిరోజైన గురువారం ఒకే నామినేషన్ దాఖలు కాగా.. శుక్రవారం సైతం ఒకటే నామినేషన్ వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేటకు చెందిన వినోద్‌రావు నామినేషన్ వెంట ఆస్తులు, అప్పులతో కూడిన అఫిడవిట్ సమర్పించారు. ఆయన పేరిట రూ.7,04,45,806 విలువైన చరాస్తులు, రూ.4,61,82,290 విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా బ్యాంకుల్లో రూ.3,42,292 రుణం ఉందని తెలిపారు. ఇక వినోద్‌రావు భార్య వినీల పేరిట రూ.2,90,77,174 విలువైన చరాస్తులు, రూ.1,68,53,662 స్థిరాస్తులు ఉన్నాయని వెల్లడించారు.

ఎఫ్‌జీడీ ఎప్పుడు పూర్తయ్యేనో..?

- రాష్ట్రంలో తొలిసారి కేటీపీఎస్‌లో కాలుష్య నియంత్రణ ప్లాంట్
- రూ.300 కోట్లతో ఏడాదిన్నర క్రితం మొదలు పెట్టిన బీహెచ్‌ఈఎల్
- పనులు పూర్తిగా నిలిచిపోయినా పట్టించుకోని జెన్‌కో అధికారులు



కేటీపీఎస్‌లో నిలిచిన ఎఫ్‌జీడీ నిర్మాణ పనులు



ఇటీవల ప్లాంట్ ఎదుట ఆందోళన చేపట్టిన కార్మికులు (ఫైల్)

పాల్వంచ: పాల్వంచలోని సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన కేటీపీఎస్ 7వ దశ కర్మాగారానికి అనుసంధానంగా నిర్మిస్తున్న కాలుష్య నియంత్రణ ప్లాంట్(ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్–ఎఫ్‌జీడీ) పనులు ముందుకు సాగడం లేదు. విద్యుత్ కర్మాగారం పూర్తయిన మూడేళ్లకు రూ.300 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. బీహెచ్‌ఈఎల్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకోగా, ఏడాదిన్నర గడిచినా పనులు చురుగ్గా సాగడంలేదు. పనులకు సంబంధించిన డ్రాయింగ్ ఇంకా రాలేదనే సాకుతో మూడు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. బీహెచ్‌ఈఎల్ నుంచి సబ్ కాంట్రాక్ట్ పొందిన ఆర్‌వీపీఆర్ కంపెనీ.. కార్మికులకు గత నాలుగు నెలలుగా ఇవ్వలేదు. దీంతో అక్కడ పనిచేసే సుమారు 32 మంది ఈ నెల 1 నుంచి పనులు నిలిపివేశారు. ఇటీవల ప్లాంట్ నిర్మాణ పనుల ప్రదేశంలో ఆందోళన చేపట్టారు. అయితే బిల్లులు రాకపోవడంతో వేతనాలు చెల్లించలేదని కంపెనీ సిబ్బంది చెబుతున్నారు.

తొలిసారిగా కేటీపీఎస్‌లోనే..

కొత్తగా నిర్మించే కర్మాగారాలకు తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ సెంట్రల్ బోర్డు ఎఫ్‌జీడీ ప్లాంట్ ఏర్పాటు తప్పనిసరి చేసింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా కేటీపీఎస్‌లో ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. మణుగూరు బీటీపీఎస్, (1080 మెగావాట్లు), నల్లగొండ జిలా దామరచర్ల వద్ద యాదాద్రి పవర్ ప్లాంట్(4వేల మెగావాట్లు) వద్ద కూడా ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మించాల్సి ఉంది. కేటీపీఎస్ 7వ దశ(800 మెగావాట్లు) నిర్మాణ పనులు పూర్తై 2018 డిసెంబర్‌లో విద్యుదుత్పత్తి అందుబాటులోకి వచ్చింది. పక్కన ఉన్న, ఆరు దశాబ్దాలుగా సిబ్బంది నివసిస్తున్న సెక్యూరిటీ కాలనీని ఖాళీ చేయించి ఐదెకరాల స్థలాన్ని ఎఫ్‌జీడీ ప్లాంట్‌కు కేటాయించారు.

పట్టించుకోని జెన్‌కో ఉన్నతాధికారులు

విద్యుత్ ఉత్పత్తికి బొగ్గును మండిస్తే అధిక కాలుష్యం వెలువడుతుంది. పొగలో హానికర సల్ఫర్ వాయువు నార్మల్ మీటర్ క్యూబ్ 50 మిల్లీ గ్రామ్స్‌కు మించకుండా ఎఫ్‌జీడీ ప్లాంట్‌తో నివారించవచ్చు. ఈ ప్లాంట్ లేకపోతే భవిష్యత్‌లో విద్యుదుత్పత్తి కర్మాగారాలకు అనుమతులను రద్దు చేస్తారు. కేటీపీఎస్ ఏడో దశ ప్రారంభించి ప్రారంభించి ఐదేళ్లు కావొస్తోంది. దీంతో తీవ్ర కాలుష్యంతో ప్రజలు శ్వాసకోశ, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. మరోవైపు జెన్‌కో ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో ఎఫ్‌జీడీ ప్లాంట్ పనులు ముందుకు సాగడం లేదు. ఇంకా డ్రాయింగ్ రాలేదని, వచ్చినా పూర్తి ఆమోదం తెలపాలంటూ మూడు నెలలుగా పనుల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారు. చివరకు పనులు ఆగిపోయినా జెన్‌కో అధికారుల్లో మాత్రం చలనం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాలుగు చోట్ల ఏఏక్యూఎం స్టేషన్లు..

ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మాణం అనంతరం కాలుష్యం అంచనాకు అంబియాస్ట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ (ఏఏక్యూఎం) స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్లాంట్‌కు నాలుగు వైపులా నాలుగు మానిటరింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. ఇందులో పాత ప్రాజెక్ట్ హాస్టల్ వద్ద, బస్టాండ్ ముందు జెన్‌కో కాలనీలో, 7వ దశ కర్మాగారంలో, కరకవాగు లేదా పునుకులలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆయా స్టేషన్ల ద్వారా గాలిలో కాలుష్యాన్ని అంచనా వేసి, అక్కడి అధికారులతోపాటు ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్‌లో ఉండే పొల్యూషన్ బోర్డు అధికారులు కూడా మానిటరింగ్ చేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తి కావడానికి మరో రెండేళ్లయినా పడుతుందనే వాదనలు ఉన్నాయి. ఈ విషయమై 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు. ఎస్ఈ(సివిల్) ఎస్.యుగపతిని వివరణ కోరగా.. ఇంకా డ్రాయింగ్ రాకపోవడంతో పనులు కొంత ఆగాయని తెలిపారు. కాంట్రాక్ట్ కంపెనీ కూడా వేతనాలు ఇవ్వక కార్మికులు పనుల్లోకి రావడం లేదని తెలిసిందని, దీనిపై పూర్తి స్థాయిలో ఉన్నతాధికారులు దృష్టిలో ఉన్నాయని వివరించారు.

ప్రతీ వస్తువుకు ఆధారాలు చూపాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గోపాల్



మాట్లాడుతున్న రామ్‌కుమార్ గోపాల్

భద్రాచలంటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, ప్రజలు ప్రయాణం చేసే సమయంలో తరలించే ప్రతీ వస్తువుకు ఆధారాలు చూపించాలని, తగిన ఆధారాలు చూపించిన వారికి అనుమతి ఇవ్వాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గోపాల్ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్ర, సర్వే బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేవారు ఆధారాలు చూపకపోతే సీజ్ చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు ప్రచార వాహనాలకు, సభలు, సమావేశాలకు అనుమతి తీసుకోకపోతే కేసులు నమోదు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్, వీడియో బృందాలు ప్రతిదీ వీడియో తీసి నోడల్ అధికారికి అందజేయాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఈఓల కార్యాలయంతో పాటు కూనవరం రోడ్డులోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టును వ్యయ పరిశీలకుడు తనిఖీ చేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఆర్డీఓ దామోదర్ రావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్, నోడల్ అధికారి ఖుర్షద్, ఏఈఓ విద్యాధర రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న చెక్‌పోస్టు అంతర్రాష్ట్ర సర్వైలెన్స్ టీం పనితీరును శుక్రవారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం రవాణా చేస్తూ ఎవరైనా పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

భద్రాచలంటౌన్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాతం వాతావరణంలో జరిగేలా ప్రజా ప్రతినిధులు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్తగూడెం స్ట్రాంగ్ రూమ్ నుంచి వచ్చే ఈవీఎంలను భద్రాచలం డిగ్రీ కళాశాలలో భద్రపరుస్తామని తెలిపారు. అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ మనిధర్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పూసుగూడెం పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ములకలపల్లి/అన్నపురెడ్డిపల్లి: ములకలపల్లి మండలంలోని వీకే. రామవరం, సుబ్బనపల్లి, చాపరాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాలను, అన్నపురెడ్డిపల్లి మండలంలోని తొట్టిపంపు పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విధిగా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు గుడ్ల పుల్లయ్య, జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఆర్ఐలు తారాచంద్, మధు, ఏఈ సుబ్బరాజు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వేడుకలు సక్సెస్





శ్రీరామనవమి వేడుకలకు హాజరైన సామాన్య భక్తులు (ఇన్‌సెట్) శ్రీసీతారామ చంద్రస్వామివారు

భద్రగిరిలో విజయవంతంగా శ్రీరామనవమి, పట్టాభిషేకం

- ఈ ఏడాది సామాన్య భక్తులే అధికం
- ఎప్పటిలాగే తప్పని వసతి కష్టాలు
- ఎండలు, ఎన్నికల కోడ్‌తో తగ్గిన వీవీఐపీలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. కాగా ఈ నెల 23 వరకు బ్రహ్మోత్సవాలలో భాగంగా ఇతర కార్యక్రమాలు జరగనున్నాయి. 16,17,18వ తేదీల్లో ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన ఎదుర్కోలు, శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు ప్రశాంతంగా జరగ్గా, రాష్ట్ర, జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

సామాన్య భక్తులే అధికం

ఈ ఏడాది నవమి, పట్టాభిషేక మహోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున వస్తారని అధికారులు అంచనా వేశారు. ఏప్రిల్‌లో ఉత్సవాలు రావడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఎన్నికల ప్రభావం కనిపించింది. దీంతో మధ్యతరగతి భక్తుల రాక తగ్గింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డి వేడుకలకు హాజరుకాలేదు. జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీవీఐపీ కేటగిరీలో హాజరయ్యారు. దీంతో రాజకీయ అనుచరుల హడావుడి లేకపోవడతో సామాన్య భక్తులు మాత్రమే అధికంగా కనిపించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వచ్చిన భక్తులు తిరిగి కల్యాణం అయిపోగానే వెళ్లిపోయారు. వెరసి ఈ ఏడాది ఉత్సవాలలో భద్రాచలంలో ఉత్సవ హడావుడి చాలా తక్కువగా కనిపించింది.

వసతి, ఉక్కపోత షరామామూలే

భద్రాచలం వచ్చిన భక్తులకు ఈ ఏడాది సైతం వసతి కష్టాలు షరామామూలుగానే మారాయి. దేవస్థాన కాటేజీలు, వసతి గదులు అధికం డోనర్లకే సరిపోయాయి. ఇక రెవెన్యూ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఉంచిన వసతి గదులు కేవలం రెండు గంటల వ్యవధిలోనే భర్తీ అయ్యాయి. దీంతో ప్రైవేట్ లాడ్జీల ఆధీనంలో ఉన్న కొద్దిపాటి గదులే దిక్కయ్యాయి. ఉన్న రద్దీతో అధిక ధరలకే ప్రైవేట్ లాడ్జీలలో గదులను బుక్ చేసుకున్నారు. భానుడి ప్రభావంతో భక్తులు, సెక్టార్లలో కల్యాణ వీక్షణానికి హాజరైన భక్తులు, వీఐపీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏసీ కూలర్లు ఏర్పాటు చేసినా అందరికీ సరిపోకపోవడంతో వీఐపీలు సైతం అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మిథిలా స్టేడియంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయకుండా షామియానా వస్త్రాలతో పందిళ్లు నిర్మించారు. దీంతో ఎండ తీవ్రత సరాసరి భక్తులనే తాకింది. దీంతో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు. కొన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు సైతం చాలా తక్కువగా ఉండటంతో బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

సీఎం రేవంత్ రెడ్డి కల్యాణానికి హాజరు కాకపోవడంతో ప్రభుత్వ సీఎస్ శాంత కుమారి కల్యాణం రోజున, గవర్నర్ రాధాకృష్ణన్ పట్టాభిషేకం రోజున హాజరయ్యారు. వీరికి ఎటువంటి ప్రొటోకాల్, ఆటంకాలు ఎదురరకుండా జిల్లా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రధానంగా కలెక్టర్ ప్రియాంక ఆల నెల రోజుల నుంచే జిల్లా, డివిజన్ స్థాయిల్లో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతురావు మూడు రోజులపాటు భద్రాచలంలోనే మకాం వేసి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈఓ రమాదేవి నవమి ఉత్సవాల విజయవంతంలో కీలక పాత్ర పోషించారు. ఉత్సవాల ప్రచార కార్యక్రమం, ఆన్‌లైన్‌లో ముందస్తుగానే సెక్టార్ల టికెట్లు ఉంచటం, తలంబ్రాలు, లడ్డూల తయారీతో పాటు విక్రయానికి కేంద్రాల సంఖ్య పెంచటం ఇలా అన్నింటా తానై వ్యవహరించారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, కార్మికులు కృషి చేశారు. ప్రభుత్వ అధికారులకు, గవర్నర్ పర్యటనలో బందోబస్తుకు, పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తగిన చర్యలు చేపట్టారు. ఇలా ఇతర అన్ని శాఖల సమన్వయం, సిబ్బంది సహకారంతో ఈ ఏడాది ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయి.

కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నామినేషన్..



ఆర్ఓ అద్వైత్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్, పక్కన ఎమ్మెల్యేలు పాయం, కోరం కనకయ్య

మహబూబాబాద్: మహబూబాబాద్ లోక్‌సభ స్థానానికి రెండో రోజు శుక్రవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ములుగు జిల్లా మదనపల్లికి చెందిన పోరిక బలరాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు సమర్పించారు. పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన పాల్వంచ దుర్గ, నర్సంపేట నియోజకవర్గం ఇటుకాలపల్లి ఏనుగుల తండాకు చెందిన బోడ అనిల్ నాయక్ స్వతంత్ర అభ్యర్థులుగా, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండకు చెందిన జాటోత్ రఘునాయక్ ఆధార్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు.

క్లుప్తంగా

రామాలయ అధికారులకు సన్మానం


అధికారులను సత్కరిస్తున్న కమిషనర్

భద్రాచలం: భద్రాచలంలో శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాల విజయవంతానికి కృషి చేసిన అధికారులను దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు శుక్రవారం సత్కరించారు. ఆలయ ఈఓ రమాదేవి, ఈఈ రవీందర్, అధికారులు శ్రీనివాసరెడ్డి, కత్తి శ్రీనివాస్‌తో పాటుగా ఇతర శాఖలకు చెందిన సిబ్బంది, అర్చకులకు శాలువా కప్పి సన్మానించారు. భక్తులకు మెరుగైన వసతులను కల్పించటంతో పాటుగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

26 నుంచి రెండు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు

తల్లాడ: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు తల్లాడ మండలం అన్నారుగూడెం మహాలక్ష్మి కమిటీ బాధ్యులు తెలిపారు. అన్నారుగూడెంలో సూపర్ లీగ్ పద్ధతిలో పోటీలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాజట్లు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 99895 30975, 77806 50748 నంబర్లలో సంప్రదించలని సూచించారు.

ఆదివాసీల సత్తా చాటాలి..


కిష్టారంలో ప్రచారం చేస్తున్న అరుణ్‌కుమార్

టేకులపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించడం ద్వారా ఆదివాసీల సత్తా ఏమిటో చూపాలని మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. ప్రధాన పార్టీలు లంబాడీలకు టికెట్ ఇచ్చి ఆదివాసీలకు అన్యాయం చేశాయని.. ఈ విషయాన్ని గుర్తించి ఆదివాసీలు తనను గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ పూనెం స్వప్న, నాయకులు చింత సంపత్, కుర్సం నాగేశ్వరరావు, జబ్బా రామకృష్ణ, పుణెం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై సస్పెన్షన్ వేటు?

ములకలపల్లి: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మండలంలోని సాయిరాంపురం గ్రామంలో వారం రోజులుగా తాగునీరు అందటం లేదు. గ్రామస్తులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఈ అంశంపై మీడియాలో సైతం కథనాలు వెలువడ్డాయి. దీంతో అధికారులు స్పందించి గురువారం మోటారు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

వడదెబ్బతో మున్సిపల్ వర్కర్ మృతి


ముకుందం(ఫైల్)

ఇల్లెందు: వడదెబ్బతో మున్సిపల్ వర్కర్ ముకుందం (60) మృతి చెందారు. రెండు రోజులుగా తీవ్రంగా వడ గాలులు వీస్తుండటం, ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల అనారోగ్యం బారిన పడిన ముకుందం శుక్రవారం మృతి చెందారు. మున్సిపల్ యంత్రాంగం, అధికారులు, సిబ్బంది, చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీ పాషా, కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలి, డీఈ, ఏఈలు నవీన్, కుమారస్వామి, శంకర్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ నేత మడుగు సాంబమూర్తి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తోగ్గూడెంలో ఘర్షణ

- ఒకరు ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: రెండు వర్గాల మధ్య జరిగగా అందులో ఒకరు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని జగన్నాథపురంలో బానోత్ సోమ్లా మృతి చెందగా తోగ్గూడెంతండాకు చెందిన మృతుడి బంధువులు శుక్రవారం వెళ్లారు. ఈ క్రమంలో బాలు, రమేశ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది కాస్తా ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో కేలోతు వీరు కుమారుడైన బాలు ఇంటిపైకి కొందరు వెళ్లగా బాలు పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు బాలును ఏరియాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

వడ్డీ వ్యాపారులపై నిఘా

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు
- అధిక వడ్డీలను అరికట్టేందుకే దాడులు


బాధితుల నుంచి నగదు వసూలు చేస్తున్న వడ్డీ వ్యాపారి

అశ్వారావుపేట: సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులిచ్చి దోపిడీకి పాల్పడే వారిపై పోలీసులు దృష్టి సారించారు. గత శనివారం రాత్రి జిల్లాలో పలుచోట్ల వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. అశ్వారావుపేట, సుజాతనగర్, ఇల్లెందు ప్రాంతాల్లో తనిఖీలు జరిపారు. రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ చిట్ వ్యాపారులు, ఫైనాన్స్, గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారులను విచారించనున్నట్లు సమాచారం. జిల్లాలోని ఓ పోలీస్ ఉన్నతాధికారిని సంప్రదించగా దాడులు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు. ఎన్నికలకు, ఎన్నికల కోడ్‌కు దాడులకు సంబంధం లేదని పేర్కొన్నారు. అధికవడ్డీలకు వ్యాపారాలు చేస్తూ దోపిడీకి పాల్పడే వారిని తొలుత హెచ్చరించాలని, అప్పటికీ మారకపోతే చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖ భావిస్తోంది. అశ్వారావుపేటలో ఇద్దరు వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించగా, వారి లైసెన్స్‌లు రెన్యువల్ చేసినట్లు, అన్ని పద్దులు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఏపీ నుంచి వచ్చి ఇల్లెందులో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని, వ్యాపారం ఆపేయాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. సుజాతనగర్‌లో ఓ వ్యాపారిని విచారించి, తాకట్టు పెట్టుకున్న నాలుగు టూవీలర్లు, ప్రాంసరీ నోట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే విధంగా దాడులు కొనసాగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ముందుగానే 20 శాతం కమీషన్..

రిజిస్టర్డ్ వడ్డీ వ్యాపారులను అధిక వడ్డీలు వసూలు చేయొద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నా ఏపీ నుంచి అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో అధిక వడ్డీలకు డబ్బులిస్తున్నారు. ముందుగానే 20 శాతం కమీషన్ కట్ చేసుకుంటున్నారు. వారానికి కొంత మొత్తం చెల్లించేలా మూడు నెలల్లో బాకీ తీర్చాలని షరతులు పెడుతున్నారు. ఒక వారం కట్టలేకపోయినా దుర్భాషలాడి పరువు తీస్తారు. దీనికితోడు అశ్వారావుపేటలోని టూవీలర్ షోరూంల నిర్వాహకులు ఏపీలోని రాజమండ్రి ప్రాంత ఫైనాన్స్ వ్యాపారులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తారు. బైక్ కొనుగోలు చేసిన వ్యక్తికి షోరూంలోనే ఫైనాన్స్ సౌకర్యం లభిస్తుంది. కానీ అప్పు మాత్రం తీరనివ్వరు. ఒక్క కిస్తీ కట్టకపోయినా ఓడీలంటూ భారీ పెనాల్టీలు విధిస్తారు. సెకండ్ హ్యాండ్ టూవీలర్ ఫైనాన్స్ దుకాణాలు ఇదే దందా కొనసాగిస్తున్నాయి. వీటి నిర్వాహకులపై కూడా పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.

వ్యాపారులపై చర్యలు



వడ్డీ వ్యాపారుల ఇళ్లలో గత ఇటీవల సోదాలు నిర్వహించాం. పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేయొద్దు. ఇలా ఎవరు చేసినా ఫిర్యాదు చేయండి. తగిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తాం.

–జితేందర్ రెడ్డి, సీఐ అశ్వారావుపేట

ఇవేం 'ఉపాధి' పనులు?

పూడిక తీత పనులను అడ్డుకున్న ఆయకట్టు రైతులు


కోతులవాగు ప్రాజెక్టులో పూడిక మట్టి తీసి నీటిలో పోస్తున్న కూలీలు


కూలీలను నిలదీస్తున్న ఆయకట్టు రైతులు

అశ్వారావుపేటరూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులను శుక్రవారం కొందరు ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పూడిక తీత పనులు కొనసాగుతుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ఆసుపాక గ్రామంలోని కోతులవాగు ప్రాజెక్టులో రెండు రోజులుగా ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 80 మందికిపైగా కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. కూలీలు తవ్విన మట్టిని ప్రాజెక్టు కట్టపైకి తరలించాల్సి ఉంది. కానీ, ప్రాజెక్టు కట్ట ప్రాంతం దూరంగా ఉందనే సాకుతో కూలీలు నిబంధనలకు విరుద్ధంగా తవ్విన మట్టిని ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిలో పోస్తున్నారు. ఈ పనులను గమనించిన కొందరు ఆయకట్టు రైతులు అక్కడికి చేరుకొని పనులు అడ్డుకున్నారు. పూడిక మట్టిని తవ్వి తిరిగి నిల్వ ఉన్న నీటిలోనే వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పనులను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు సంబంధించిన తూముల దగ్గర కుడా పూడిక మట్టి వేయడంతో అవి మెరకగా అవుతున్నాయని, తూములు మెరక అయితే సాగునీరు పంట పొలాలకు ఎలా పారుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' స్థానిక ఈజీఎస్ ఏపీఓ నరేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించారు. కోతులవాగు ప్రాజెక్టులో చేస్తున్న పనులను తక్షణమే నిలిపి వేస్తానని, పూడిక తీసిన మట్టిని కట్టపైకి తరలించేలా చర్యలు చేపడుతానని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసిన కూలీలు, ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

అక్రమమా.. ఫిర్యాదు చేయండి

- 'సీ – విజిల్'తో సులువు, పారదర్శకత
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఎన్నికల వేళ తాయిలాలు సర్వసాధారణమయ్యాయి. అయితే, వీటిపై ఇన్నాళ్లు నేరుగా మాత్రమే ఫిర్యాదు చేయడానికి అవకాశముండేది. దీంతో నాయకులు, అభ్యర్థులపై భయం కారణంగా చాలామంది ఫిర్యాదుకు ముందుకొచ్చే వారు కాదు. ఈ నేపథ్యాన ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినా.. ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు తెలిసినా, బహుమతులు దాచినట్లు గుర్తించినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఫొటోలు, వీడియోలు ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అధికారులు తక్షణమే రంగంలోకి దిగి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. ఈక్రమంలో ఎక్కడ కూడా ఫిర్యాదుదారుల పేరు, వివరాలు బయటకు వచ్చే అవకాశం లేనందున నిర్భయంగా ముందుకు రావాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. – ఖమ్మం సహకారనగర్

వంద నిమిషాల్లోనే చర్యలు..

ఎక్కడైనా మద్యం, డబ్బు, ఇతర సామాగ్రి ద్వారా ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిసినా, ఇతర అంశాలపైనా ఫిర్యాదు చేయొచ్చు. ఈ మేరకు యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు అందిన 100నిమిషాల్లోగా ఘటనా స్థలికి చేరుకుని చర్యలు తీసుకుంటారు. ఆపై ఏం చర్యలు తీసుకున్నారనే అంశం కూడా ఫిర్యాదుదారుడికి చేరవేస్తారు. ఇక సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని అధికార యంత్రాంగం చెబుతోంది.

డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వారెవరైనా ప్లే స్టోర్ నుంచి సీ–విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. అనంతరం ఫొటో, వీడియో, ఆడియో మూడు రకాల ఆప్షన్లు వస్తాయి. లైవ్ లొకేషన్ ఆన్ చేసి అక్కడి పరిస్థితుల ఆధారంగా ఎంపిక చేసుకుని ప్రొసీడ్ కొట్టాలి. ఆపై ఫిర్యాదు నేరుగా సంబంధిత అధికారులకు చేరుతుంది.

కంట్రోల్ రూం నుంచి..

సీ–విజిల్‌కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కంట్రోల్ రూమ్ సిబ్బంది ఘటనాస్థలికి సమీపాన ఉన్న అధికారుల బృందానికి సమాచారం చేరవేస్తారు. ఆ వెంటనే అధికారుల బృందం అక్కడకు వెళ్లి ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తుంది. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, ఇతర అధికారులకు వెల్లడిస్తే.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

అసెంబ్లీ నుంచి అధికంగా..

గత అసెంబ్లీ ఎన్నికల నుంచి సీ–విజిల్ యాప్‌పై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రలోభాలకు చెక్ పెట్టాలంటే ఈ యాప్ బాగా ఉపయోగపడుతుందని చెబుతూ ప్రజల్లోకి వెళ్లేలా ప్రచారం చేశారు. అలాగే, కళాశాలల్లో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించగా.. ఎక్కువ మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా కృషిచేస్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన మళ్లీ యాప్ ద్వారా ఫిర్యాదుకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పిస్తున్న నేపథ్యాన మంచి ఫలితాలు వస్తాయనే భావన వ్యక్తమవుతోంది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సువిధ.. సులువుగా..!



లోక్‌సభ(పార్లమెంట్) ఎన్నికల సమరం ఊపందుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కాగా, ఇప్పుడిప్పుడే నామినేషన్లు దాఖలవుతున్నాయి. ఈనేపథ్యాన బరిలోకి దిగే అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన పారదర్శకతతో పాటు అభ్యర్థులకు సులువయ్యేలా కేంద్ర ఎన్నికల సంఘం 'సువిధ' పేరిట యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే యాప్‌ను వినియోగించేలా రాజకీయ పార్టీల నాయకులకు అధికారులు అవగాహన కల్పించారు. యాప్ ద్వారా దరఖాస్తులు, అనుమతుల జారీ వల్ల అంతా సాఫీగా సాగుతుందని అధికార యంత్రాంగం చెబుతోంది. – ఖమ్మం సహకారనగర్

- ఎన్నికల వేళ ఆన్‌లైన్‌లో అనుమతులు
- సభలు, సమావేశాల నిర్వహణకు యాప్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ.. ఆపై అనుమతుల జారీ

• 48 గంటలకు ముందు దరఖాస్తు

ఎన్నికల సమయంలో అభ్యర్థులు, పార్టీల నాయకులకు ప్రతీ నిమిషం విలువైనదనే చెప్పాలి. ఈమేరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహణ కోసం నిర్ణీత తేదీకి 48గంటల ముందు సువిధ యాప్ ద్వారా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కడ సభ నిర్వహించనున్నారు, ర్యాలీ అయితే ఎక్కడి నుంచి ఎక్కడి వరకు సాగుతుంది.. ఎన్నివాహనాలు పాల్గొంటాయి తదితర అంశాలతో సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై అధికారులు అన్ని వివరాలు పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

• ఎక్కడికక్కడే అనుమతి

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ మేరకు సువిధ యాప్ ద్వారా అందే దరఖాస్తులను సభ, ర్యాలీ జరిగే ప్రాంతం ఆధారంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అనుమతి ఇస్తారు.

• మొదటి దరఖాస్తుకే ప్రాధాన్యత

సభలు, సమావేశాల నిర్వహణకు ఒకటి కంటే ఎక్కువ పార్టీల ఒకే మైదానాన్ని ఎంచుకుంటే మొదటి అందిన దరఖాస్తుకే అధికారులు ప్రాధాన్యత ఇస్తారు. గెస్ట్ హౌస్‌ల విషయంలోనూ ఇదే నిబంధన పాటిస్తారు. ఇదిలా ఉండగా గురువారం లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా బీజేపీ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. మిగతా పార్టీల నామినేషన్లు, సభలు మొదలు కానుండడంతో అదే స్థాయిలో సువిధ యాప్ ద్వారా దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.

సీతారాములకు మహదాశీర్వచనం

నేడు రామయ్యకు తెప్పోత్సవం, దొంగలదోపు


పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల జంటకు పండితులు మహదాశీర్వచనం అందజేశారు. స్వామివారి నిత్యకల్యాణ మహోత్సవం అనంతరం నూతన వధూవరులైన సీతారామ చంద్రుల వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం ఇవ్వడమే ఈ సదస్యం పరమార్థం. సీతారాముల కల్యాణంలో పాల్గొని తిలకించిన భక్తులకు సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ ఉత్సవాలలో అంతర్భాగంగా ఈ క్రతువు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు వివరించారు. కల్యాణం జరిగిన మూడో రోజు స్వామి వారికి మహదాశీర్వచనం అందజేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని వెల్లడించారు. ఈ సందర్భంగా స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి పూలు, పండ్లను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం తెప్పోత్సవం, దొంగల దోపు ఉత్సవాలను నిర్వహించనున్నారు.

చెట్ల కిందనే పార్కింగ్..


రవాణాశాఖ కార్యాలయంలో ఎండలో నిలిపిన వాహనాలు

రవాణాశాఖ కార్యాలయంలో పార్కింగ్ షెడ్లు లేక అవస్థలు

కొత్తగూడెంటౌన్: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో పార్కింగ్ షెడ్లు లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండటంతో పనినిమిత్తం వచ్చేవారు పార్కింగ్ షెడ్లు లేక చెట్ల కింద, ఎండలోనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి ఉదయం 11 గంటలకు వస్తే సాయంత్రం 5 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోందంటున్నారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి రోజుకు వందలాది మంది రిజిస్ట్రేషన్, లైసెన్స్‌ల పర్మిషన్ కోసం వస్తారు. వారి వాహనాలు నిలిపేందుకు, వాహనదారులు ఉండేందుకు ఎలాంటి షెడ్లు లేకపోవడంతో ఎండలోనే మగ్గాల్సి వస్తోందని చెబుతున్నారు. వాహనదారుల నుంచి అన్ని రకాల ఫీజులను వసూలు చేస్తున్న అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంతో విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

బాంబ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, బాంబ్ స్క్వాడ్

దుమ్ముగూడెం: మండల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో పార్లమెంట్ మొదటి విడత ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో సీఐ అశోక్ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. మండలంలోని మారాయిగూడెం, చెరుపల్లి, కొత్తపల్లి, లక్ష్మీపురంలో బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. మారాయిగూడెం, గొల్లపల్లి, కిష్టారం పరిధిలో పోలింగ్ అనంతరం ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది సురక్షితంగా కుంటకు చేరేందుకు, మండల సరిహద్దులో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మధిరరూరల్: మధిర మండలం మాటూరు క్రాస్ వద్ద శుక్రవారం రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మధిర రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై లక్ష్మీ భార్గవి ఆధ్వర్యాన పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మధిర నుంచి ఆంధ్రా వైపుకు వెళుతున్న రెండు వాహనాలను పరిశీలించారు. అందులో రేషన్ బియ్యం ఉండడంతో వాహనాలను మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

25 ఎకరాల మొక్కజొన్న దగ్ధం

సుమారు 20 లక్షల నష్టం


గుండాల: కాలిపోయిన మొక్కజొన్న చేను


ఇల్లెందు రూరల్ : దగ్ధమవుతున్న మొక్కజొన్న కంకులు

గుండాల: ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి, వేలల్లో పెట్టుబడి పెట్టి పండించిన మొక్కజొన్న చేతికొచ్చే సమయంలో అగ్ని దహించి వేసింది. సుమారు 25 ఎకరాల మొక్కజొన్న చేతికందకుండా పోవడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. ఈ ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఊకె నర్సయ్య, జోగా రవీందర్, ఊకె పగడయ్య, ఊకె సారయ్య, పెండెకట్ల పెంటయ్య, వాగబోయిన మోహన్ సుమారు 25 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో స్థానిక అడవుల నుంచి మంటలు వ్యాపించి మొక్కజొన్న చేన్లు కాలిపోయాయి. ఒక్కో ఎకరానికి సుమారు రూ.లక్ష చొప్పున నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు విద్యుత్ మోటార్ల సాయంలో సాగు నీరు అందిస్తుండగా ఆ పైపులు సైతం కాలిపోయాయని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

మొక్కజొన్న కంకులకుప్ప..

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామ పంచాయతీ భద్రుతండాకు చెందిన బాదావత్ మంగుకు చెందిన మూడు ఎకరాల మొక్కజొన్న కంకుల కుప్ప ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. ఒక ఆకతాయి ఎండిపోయిన చేనులో వేసిన నిప్పు చేనంతా అంటుకుంది. ఈ క్రమంలో ఓ మడిలో కుప్పగా వేసుకున్న మొక్కజొన్న కంకులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రైతు మంగుకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

అదుపుతప్పిన బైక్.. వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

కరకగూడెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం ఆళ్లపల్లి మండలంలోని అనంతోగు గ్రామానికి చెందిన గలిగ లక్ష్మీనారాయణ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై కరకగూడెం వచ్చి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో రేగళ్ల గ్రామం వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తన కుడి మోకాలు, నడుముకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి, సీతానగరం గ్రామాల్లో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐలు కేశవరావు, గణేశ్ శుక్రవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య తన సిబ్బందితో పెద్దనల్లబల్లి, సీతానగరం సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో పెద్దనల్లబల్లి సెంటర్‌లో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 40 లీటర్ల నాటుసారా లభ్యం కావడంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే, సీతానగరం సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 40 లీటర్ల నాటుసారా లభ్యం కావడంతో వారిని కూడా పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా సుజ్ఞానపురం గ్రామానికి చెందిన అజ్మీరా నాగేశ్వరరావు, శ్రీకాంత్, భూక్యా బాబూరావు, భూక్యా సాంబగా తేలింది. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐలు తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్ బీభత్సం

సత్తుపల్లిటౌన్: మద్యం మత్తులో ఓ డ్రైవర్ కారు నడిపి బీభత్సం సృష్టించిన ఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. సదరు వ్యక్తి కారులో వేగంగా వస్తూ పాతసెంటర్‌లో ద్విచక్రవాహనం, ట్రాలీ ఆటోను ఢీకొట్టటాక అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న రామానగరం గ్రామానికి చెందిన యలమర్తి పార్వతికి గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేరుకున్న పోలీసులు మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌ను అదుపులోకి విచారిస్తున్నారు.